క్లుప్తంగా

జనావాసాల్లో పందుల నియంత్రణ



చినముషిడివాడ ప్రాంతంలో పందిని కాల్చుతున్న జీవీఎంసీ షూటర్

సాక్షి ఎఫెక్ట్..

పెందుర్తి: జీవీఎంసీ జోన్–8 పరిధిలో జనావాసాల్లో సంచరిస్తున్న పందులను నియంత్రించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. జోన్–8 కమిషనర్ హైమావతి ఆదేశాల మేరకు సహాయ వైద్యాధికారి పర్యవేక్షణలో పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం పందులను జీవీఎంసీ షూటర్ ద్వారా కాల్చారు. విలీన ప్రాంతాల్లో జనావాసాల్లో 'పందుల స్వైర విహారం' శీర్షికతో సాక్షి దినపత్రిక కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన జెడ్సీ హైమావతి పందుల నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా పందులను నియంత్రిస్తామని ఆమె పేర్కొన్నారు.

భద్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు సూచనలిస్తున్న సీఐ బాలసూర్యారావు

పరవాడ: రహదారి భద్రతపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సీఐ ఎస్.బాలసూర్యారావు సూచించారు. విద్యార్థులకు రోడ్డు భద్రత, ర్యాగింగ్, సైబర్ క్రైం వంటి అంశాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ర్యాగింగ్ వంటి కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైం నేరగాళ్లతో జాగ్రత్తగా వ్యవహరించాలని సీఐ బాలసూర్యరావు చెప్పారు.

అభివృద్ధికి సహకరించండి



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పి.సంపత్‌కుమార్‌ను బుధవారం జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు మర్యాదపూర్వకంగా కలిశారు. వార్డులోని ప్రధాన సమస్యలను కమిషనర్‌కు వివరించారు. అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

కార్మిక పక్షపాతి సూర్యనారాయణ



కార్మిక నేత సూర్యనారాయణకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: కార్మిక హక్కుల కోసం నిస్వార్థంగా పోరాడిన కార్మిక నేత ఎం.సూర్యనారాయణ మృతి చెందడం ఉద్యమానికి తీరని లోటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. పరవాడలో బుధవారం ఏర్పాటు చేసిన సీఐటీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ సంతాప సభ నిర్వహించారు. ముందుగా సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నుంచి కష్ట జీవుల కోసం పనిచేసిన సూర్యనారాయణ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఎం.సంతోష్‌కుమార్, పి.అప్పలరాజు, పి.పైడిరాజు, భరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.రమణ, ఎ.బంగ్రరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రోకర్లను నమ్మి మోసపోవద్దు

- ప్రభుత్వ స్థలాలు కొంటే ఇబ్బందులు పడతారు
- అర్హత ఉంటే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోండి
- భూ కబ్జాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు
- పెందుర్తి తహసీల్దార్ వేణుగోపాల్



స్థలాలు ఆక్రమించిన వారితో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్



ప్రభుత్వ స్థలంలో వేసిన పాకలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

పెందుర్తి: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి విక్రయాలు చేస్తున్న బ్రోకర్లను నమ్మి మోసపోవద్దని తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ సూచించారు. కబ్జాలు చేసిన స్థలాలను కొంటే ఆర్థికంగా నష్టపోతారని హెచ్చరించారు. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీపంలోని టీచర్స్ లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 185 ప్రభుత్వ స్థలంలో వెలసిన ఆక్రమణలపై తహసీల్దార్ కన్నెర్ర జేశారు. అక్కడ ఇటీవల వేసిన పాకలను పోలీసులతో కలిసి బుధవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు తక్కువ ధరలకు వస్తాయని కాయకష్టం చేసుకున్న డబ్బులతో కొనుగోలు చేస్తే తర్వాత నష్టపోతారని చెప్పారు. నిజంగా నిరుపేదలు అయ్యి..ఇంటి స్థలానికి అర్హత ఉన్నవారైతే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి కచ్చితంగా న్యాయం చేస్తామన్నారు. పేదల ముసుగులో ప్రభుత్వ భూములు కబ్జాలు చేస్తే సహించబోమన్నారు. ప్రభుత్వ భూముల క్రయ విక్రయాలు చేస్తే క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఆక్రమణల తొలగింపులో ఆర్ఐ సాయి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న రావలమ్మపాలెం పాఠశాల పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి శివారు రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులంతా ఒక చోట కలిసి సందడి చేశారు. 1990–91 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన వారంతా కొత్తవలస సమీపంలోని ఓ రిసార్ట్‌లో బుధవారం కలుసుకున్నారు. పాఠశాల రోజుల్లోని మధుర జ్ఞాపకాలు,అల్లరిని గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. విందు వినోదాలతో గడిపి గ్రూప్ ఫొటోలు దిగి సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సబ్బవరపు నారాయణమూర్తి, బోకం శ్రీను,బోకం జగదీష్,కిల్లి ముత్తుబాబు, కొటాన రాంబాబు,మండల దేముడు,నీటిపల్లి గంగాధర్,పరదేశమ్మ,రాజేశ్వరి,గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

గట్లపై మొక్కలు పెంచాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఏవో చంద్రావతి

పరవాడ: పొలం గట్లపై ఎర మొక్కలు నాటుకోవడం ద్వారా పురుగుల ఉధృతికి చెక్ పెట్టే అవకాశాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సీహెచ్. చంద్రావతి సూచించారు. రావాడలో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. చీడ, పీడలను తగ్గించుకోవడానికి పొలం గట్లపై పసుపు పూలు పూచే కంది, బంతి, జనుము, పొద్దుతిరుగుడు లాంటి మొక్కలు నాటుకోవాలన్నారు. ఈ మొక్కలు పురుగులను ఆకర్షించి వరి పంటను కాపాడడానికి దోహదపడతాయన్నారు. వరి నాట్లు పూర్తి అయిన నెల రోజుల తర్వాత ద్రవరూప సూడోమోనాస్ మందు ఎకరానికి అర లీటరు పిచికారీ చేయాలన్నారు. ఫలితంగా అగ్గి తెగులు, పాడ తెగులు బాక్టీరియా, ఆకుపాడ తెగుళ్ల నుంచి రక్షణ కల్పించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, శ్రీనివాస్, రాజేశ్వరి, వ్యవసాయ సహాయకులు గౌతమి, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

చేనేత చీరల్లో మెరిశారు



చేనేత చీరలను ప్రదర్శిస్తున్న మహిళలు

పెందుర్తి: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన చేనేత చీరల ప్రదర్శన ఆకట్టుకుంది. కళాశాలలోని స్కిల్ హబ్‌లో విద్యార్థులు తయారు చేసిన చేనేత చీరలు ప్రదర్శించారు.మహిళలు వాటిని ధరించి హొయలొలికించారు. స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ బి.సౌజన్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ధ్వంసంపై రైతుల ఆందోళన

రాజకీయ కక్షలతో ఇబ్బందులకు గురి చేయవద్దు



రైతులతో కలిసి ఆందోళన చేస్తున్న పెంటారావు

సబ్బవరం: జిరాయితీ భూమిలో రైతుల పొలాలకు వెళ్లేందుకు నిర్మించుకున్న రోడ్డును రాజకీయ కక్షతో ధ్వంసం చేసిన వ్యక్తులతో పాటు రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దళిత సంఘం నేత పాల్తేటి పెంటారావు డిమాండ్ చేశారు. మండలంలోని ఇరువాడ గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకొని రైతుల పొలాల్లోకి వెళ్లే రోడ్డును తవ్వడాన్ని నిరసిస్తూ బుధవారం ఆయన రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఇరువాడ గ్రామంలో సర్వే నెంబర్ 108లో రైతుల పొలాల్లోకి వెళ్లే రోడ్డును ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి , ఆర్ఐ, వీఆర్వోలు పొక్లెయిన్ సాయంతో ధ్వంసం చేయడంతో రైతులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పూర్వం నుంచి రోడ్డు ఉండడంతోనే జాతీయ రహదారి విస్తరణ సమయంలో రోడ్డుకు జాతీయ రహదారి నుంచి డైవర్షన్ ఏర్పాటు చేశారన్నారు. స్థానికంగా ఉండే నేత ఒత్తిడితోనే రెవెన్యూ సిబ్బంది రోడ్డు తవ్వేశారని ఆరోపించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడిన వ్యక్తితో పాటు రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని లేదంటే తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. తాతారావు అనే రైతు మాట్లాడుతూ గ్రామ రైతులంతా 50 ఏళ్లగా ఇక్కడ పొలాలు సాగుచేసుకొంటూ జీవనం సాగిస్తున్నామన్నారు.స్థానిక ఎమ్మెల్యే పేరు అడ్డుపెట్టుకొని ఆ వ్యక్తి వివాదాలకు దిగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

విద్యార్థులు ఇష్టంగా తినేలా 'మధ్యాహ్న భోజనం'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలతో విద్యార్థులు ఇష్టంగా తినేలా ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం అమలుపై విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్టీరింగ్, పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం అమలులో రైస్ మినహా, మిగిలిన మెనూ అంతా బాగుందని తెలిపారు. బియ్యం బాగా లేకపోతే వాటిని తిప్పి పంపాలని కలెక్టర్ సూచించారు. మధ్యాహ్న భోజనం కోసమే బడికి వచ్చే విద్యార్థులు చాలా మంది ఉన్నారని, ఇటువంటి పరిస్థితిలో పిల్లలు ఇష్టపడి తినేలా పదార్థాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఈ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి ఎంపీడీవో తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించి, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఉపాధ్యాయులు,

విద్యార్థుల హాజరుతో పాటు పారిశుధ్యం పనులు పరిశీలించాలని జెడ్పీ సీఈవోకు సూచించారు. వారంలో రెండు పాఠశాలలు సందర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థుల వివరాలను ఆర్‌బీఎస్ నోడల్ అధికారికి తెలియజేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలో 584 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిలో 61,228 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు. ఈ సమావేశంలో డీఎం హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎస్‌వో సూర్యప్రకాశరావు, సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఎం.శోభారాణి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పశు గణనకు అధికారులు సిద్ధంగా ఉండాలి



పశు గణన పోస్టర్ ఆవిష్కరిస్తున్న పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ రామకృష్ణ, అధికారులు

ఆరిలోవ: పశు గణన కోసం పశు సంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. పశు గణనకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం డెయిరీ ఫారం వద్ద జిల్లా పశు సంవర్ధక శాఖ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. జిల్లా నోడల్ అధికారి మాదిన ప్రసాదరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి ఇంటిలోను పశువులు, కోళ్లు, తదితర వాటిని ఎలా నమోదు చేయాలో వివరించారు. ఈ సందర్భంగా ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లతో కలసి జేడీ డాక్టర్ రామకృష్ణ పశు గణనకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 21వ అఖిల భారత పశు గణన ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభం కానుందన్నారు. పశు గణనకు జిల్లాలో 130 మంది ఎన్యుమరేటర్లు, 25 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లు తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.